www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 3 ఆగస్టు 2024
5
అన్నమయ్య

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-రాయచోటి

కడప కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో ఏసి, సెల్ ఫోన్లు రిపేరు గ్రామీణ యువకులకు (అన్నమయ్య, కడప జిల్లాల) ఆగస్టు 5 నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ శుక్రవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు గల గ్రామీణ నిరుద్యోగ యువకులపై శిక్షణ కార్యక్రమాలకు గ్రామీణ ప్రాంతాల యువకులకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని అర్హులైన నిరుద్యోగ యువకులు ఈ ఉచిత శిక్షణ తరగతులకు కొరకు తమ యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో కడపలో ఉన్న కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9440905478, 9985606866, 9440933028 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

పాఠశాలల్లో 'పోషకాల తోట' అమలు చేయాలి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పోషకాలతోట కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పాఠశాలలలో 'పోషకాలతోట' (న్యూట్రిషన్ గార్డెనింగ్) కార్యక్రమంపై వ్యవసాయ, ఉద్యానవనం, ఐసిడిఎస్, అటవీ, ఎన్ఆర్ఇజిఎ, తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలలో సొంతంగా ఆహారాన్ని ఉత్పత్తి చేసుకునే నైపుణ్యాన్ని పెంపొందించుకునే ఒక ప్రత్యేక కార్యక్రమం అని, పోషకాలను సొంతంగా ఉత్పత్తి చేసుకోవచ్చని పిల్లలకు తెలిపే మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంపై నెలవారి సమావేశాన్ని పెట్టుకొని సమీక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్ర అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కావలసిన విత్తనాలు, పోషకాలు, ఎరువులు, వంటివి అందజేసేటట్లుగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కావలసిన విత్తనాలు తదితర అంశాలపై సహాయాన్ని అందించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, ఐసిడిఎస్, అటవీశాఖ, ఎన్ఆర్ఇజిఎ, తదితర శాఖలన్నీ సమన్వయంతో పనిచేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, ఐసిడిఎస్ పీడీ, అటవీ, ఎన్ఆర్ఇజిఎ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం వైద్యాభివృద్ధికి అధిక నిధులు ఖర్చు చేస్తుందని వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వైద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని వైద్యులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందిం చాలన్నారు. ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు చాలావరకు పేదవాళ్లు ఉంటారని వారిని ఆప్యాయతతో పలకరించి వైద్య సేవలందించాలన్నారు. ఆసుపత్రికి రోజు ఎంతమంది పేషెంట్లు వస్తున్నారు, ఆసుపత్రిలో ఏమేమి సమస్యలు ఉన్నాయి వంటి వివరాలను వైద్యాధిలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించి సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.

లే అవుట్ పనులు త్వరగా పూర్తి చేయాలి : మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్మిస్తున్న ఎంఐజి లే అవుట్ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సంబంధిత అధికా రులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో కలిసి లే అవుట్‌ను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతం దిగువ అబ్బవరం దగ్గర నిర్మిస్తున్న లేఅవుట్‌కు సంబంధించి భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్, రోడ్లు నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు.

క్రికెట్ స్టేడియం పనులు పరిశీలన : జిల్లా కేంద్రంలో రూపుదిద్దుకుంటున్న క్రికెట్ స్టేడియంను రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని నక్కలవాండ్లపల్లి వద్ద 32.62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న స్టేడియం పూర్తయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతున్నారు. నూతన జిల్లాలో స్టేడియం నిర్మించుకోవడం ఎంతో శుభ పరిణామని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పేదల ఆకలితీర్చేందుకు అన్న క్యాంటీన్లు : పేదల ఆకలి తీర్చడానికి పట్టణంలోని పాత బస్టాండులో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. గతంలో అన్న క్యాంటీన్లకు ఎంతో ప్రాముఖ్యత ఉండేదని తెలిపారు. మళ్లీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించి కూలీల కడుపు నింపడం చాలా సంతోషంగా ఉందన్నారు.

క్రీడాకారులు మరిన్ని పథకాలు సాధించాలి : ప్యారిస్ ఒలంపిక్స్‌లో మన క్రీడాకారులు మరిన్ని పథకాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వర్యంలో ఇండియా తరపున వివిధ క్రీడలలో పాల్గొనే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో ఇండియా క్రీడాకారులు ఇప్పటికే మూడో పతకం సాధించడం ప్రతి ఒక్కరు ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు చదువు పైనే కాకుండా క్రీడలలో కూడా రాణించి గొప్ప క్రీడాకారులుగా ఎదిగి మన రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సమాజంలో క్రీడలకు మంచి గౌరవం ఉంటుందని ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ గౌస్ బాషా, శాప్ కోచ్ చంద్రశేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలపై అన్యాయంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అణగారిన వర్గాలలో జరుగుతున్న అన్యాయాలపై రాజ్యాంగ విలువలు, హక్కులను కాపాడేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. సమాజంలో ఏమి జరుగుతోంది ఎటువంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి అనే కేసుల పరిస్థితి తదితరాలపై కూడా కమిటీ సభ్యులు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఎస్‌సి, ఎస్‌టిల గ్రామాల వివరాలు సేకరించి అక్కడ జరుగుతున్న అన్యాయాలపై ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించి దళితులకు ఎక్కడా అన్యాయం చోటు చేసుకోకుండా చూడాలన్నారు. జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీకి సంబంధించిన కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసు కుంటామని మంత్రివర్యులు తెలిపారు. వారికి సంబంధించిన భూ సమస్యలు ఏమైనా ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిస్కరించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు.దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని ఎక్కడ వారు అన్యాయానికి గురికాకుండా ఎస్‌సి, ఎస్‌టిల విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని పోక్సో చట్టం, బాల్య వివాహాలు నిరోధక చట్టం పైన ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బాల్య వివాహాలను అరికట్టే చర్యల్లో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెంచాలన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్‌సి, ఎస్‌టి వర్గాలపై నమోదైన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కారంలో భాగంగా ఎటువంటి సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు కేసు పెట్టి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలన్నారు. ఎఫ్‌ఐఆర్ కాగానే బాధితులకు పరిహారం అందజేస్తున్నట్లు చూడాలన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీసులతోపాటు సంబంధిత శాఖల అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కేసులలో ఎప్పటికప్పుడు ఛార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తిచేయాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ బాలికల ఆశలలో వేడి నీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, అరవ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, నదియా, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, డిఎస్‌పిలు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామసుబ్బయ్య, జిల్లా ఎస్‌టి సంక్షేమ అధికారులు, జిల్లా నిఘా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిరుద్యోగుల తొలగింపు అన్యాయం : సిఐటియు

ఎపిఎండిసి సిపిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె(పుల్లంపేట)

ఓబులవారిపల్లె ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్‌లో మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న చిరు ఉద్యోగులను లాభాల కోసం స్కూల్ కాంట్రాక్టర్, యాజమాన్యం తొలగించడం అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు అన్నారు. శుక్రవారం ఎపిఎండిసి స్కూల్ ప్రిన్సిపల్ రేవతి, సిపిఒ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేట గ్రామం పరిధిలో ఉండే ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ కాంట్రాక్టర్ టెండర్ లేకుండా, నూతన ప్రభుత్వంలో యాజమాన్యం, ఉషోదయ ఎడ్యుకేషన్ అకాడమీ వారికి కట్టబెట్టడం అన్యాయమని తెలిపారు. పిలిచిన టెండర్లను ఎందుకు నిలుపుదల చేశారో సమాధానం చెప్పాలన్నారు. స్కూలు ప్రారంభంలో 500 మంది విద్యార్థులతో ఆరవ తరగతి వరకు ప్రారంభించారన్నారు. ఆనాడు 24 మందిని నాన్ టీచింగ్. హౌస్ కీపింగ్, స్కావెంజర్స్‌ని నియమించారన్నారు. తర్వాత వెయ్యి మంది విద్యార్థులు దాటిన తర్వాత మరో 10 మందిని గత మేనేజ్‌మెంట్ నాలుగు సంవత్సరాల నుండి తీసుకొని పని చేస్తున్నారన్నారు. నూతన మేనేజ్‌మెంట్ వచ్చిన తర్వాత, మధ్యలో వారిని ఉద్యోగం నుండి తొలగిస్తూ పనులకు రావద్దని, చెప్పడం అన్యాయం అన్నారు. విద్యార్థులు పెరగడం, పని భారం పెరిగిందన్నారు. పాత మేనేజ్మెంట్, పని చేయించుకొని, రూ.8 వేలు జీతం ఇచ్చే వారిని, కొత్త మేనేజ్‌మెంట్ వచ్చిన తర్వాత కూడా ఎవరిని తొలగించమని చెప్పి, మధ్యలో ఇప్పుడు, ఎందుకు తొలగిస్తున్నారు సమా ధానం చెప్పాలన్నారు. టెండర్ షెడ్యూల్లో, ఎంతమంది విద్యార్థులకు, ఎంత విస్తీ ర్ణానికి, స్వీపర్స్, స్కావెంజర్స్, హౌస్ కీపింగ్, అటెండర్స్, ఎంతమంది, అవస రమో షెడ్యూల్లో ఉంటాయని తెలిపారు. టెండర్ లేకుండా ఎమ్‌డి కొత్తవారికి కట్ట పెట్టడంతో లాభాల కోసం, సిబ్బందిని తొలగిస్తున్నారని ఆరోపించారు. తొలగించిన వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరో తేదీలోగా విధులకు చేర్చుకోకుంటే, నిరసన దీక్షలకు, సమ్మెకు దిగుతామని, హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎండిసి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నారదాసు సుబ్బరాయుడు, బాధితులు లలితమ్మ, రాణి, దేవి, మౌనిక, వరలక్ష్మి, శాంతమ్మ, ప్రసన్న, లక్ష్మీదేవి, చిట్టెమ్మ, గ్రీష్మ పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడానికి వీలుగా డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన పాఠశాలలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ కూడా ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. తద్వారా విద్యార్థులు ఇంటర్ వరకు ఇక్కడే చదువుకునే వీలుంటుందన్నారు. నేటి విద్యార్థులే రేపటి బావిభారత పౌరులని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పశువులకు తరచూ వైద్య పరీక్షలు చేయించి సకాలంలో మందులు వాడాలని పశు సంవర్థక శాఖ డిప్యూటి డైరెక్టర్ సత్యనారాయణ, మదనపల్లె ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ రోహిణి తెలిపారు. శుక్రవారం మదనపల్లె మండలం, బసినికొండ పంచాయతీ రామాచార్లపల్లి, గంగన్న గారిపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువుల పెంపకం, అందించే పశుగ్రాసం, దాణా, పశువులలో కనిపించే సాధారణ వ్యాధి లక్షణాలు గుర్తింపు, పాల ఉత్పత్తి, లేగ దూడల పెంపకం తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం సుమారు 180 పశువులకు బూటాక్స్ స్ప్రే చేయడంతో పాటు 60 దూడలకి నట్టల నివారణ మందులు తాపించారు. పశువులు, కోళ్లు, కుక్కలు తదితర జంతువులకు సాధారణ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్స్ ఫార్మా మందుల కంపెనీ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ రెడ్డిబాబు, చంద్రశేఖర్ పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లారెన్స్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ నరసింహారెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, పశు వైద్య సిబ్బంది శివ, పాడి రైతులు పాల్గొన్నారు.

గంగన్నగారిపల్లెలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరం

పిల్లల కోసం సర్కస్ ప్రదర్శన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆవరణలో శుక్రవారం గీత సర్కస్ నిర్వాహకులు నాగరాజు వారి బృందంచే సర్కస్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంపి.ఆనందన్ సర్కస్ బృందాన్ని అభినందించి జ్ఞాపికలు బహూకరించారు. ముత్తు ఆంగ్ల మాధ్యమ ప్రిన్సిపల్ ఎ.కవితా రాణి, ప్రధానోపాధ్యాయురాలు పట్నం గిరిజమ్మాల్, ఉపాధ్యాయులు బృందాన్ని సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మెరుగైన సాగు యాజమాన్య పద్ధతులపై పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు మండల వ్యవసాయ అధికారి నాగ ప్రసాద్ అవగాహన కల్పించారు. శుక్రవారం మదనపల్లె మండలం, కోళ్లబైలు పంచాయతీ రైతు సేవా కేంద్రం పరిధిలో మేకలవారిపల్లెలో పొలంబడి నిర్వహించారు. రైతులకు పురుగుమందులు అధికంగా వాడకం వలన కలిగే దుష్ప్రభావాలు, వేరుశనగలో ఎరువుల యాజమాన్యం, జిప్సం ఆవశ్యకత వంటి మేలైన సాగు పద్ధతులు గురించి చైతన్య పరిచారు. లైట్ ట్రాప్ యొక్క ఉపయోగం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రెడ్డిశేఖర్, పృథ్వీరాజ్, ఎపి మాస్ సంస్థ వాసుదేవరెడ్డి, అమరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మదనపల్లె డిఎస్‌పిగా కొండయ్య నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డిఎస్‌పి)గా కొండయ్య నాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ డిజిపి కార్యాలయంలో ఉన్న ఆయన బదిలీపై మదనపల్లెకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న పూర్వ డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి బదిలీపై విజయవాడ డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా నూతన డిఎస్‌పి కొండయ్యనాయుడు విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని పోలీసు అధికారులందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోలీసులకు ప్రజలు, ప్రజా పాలకులు సహకరించాలని కోరారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా మదనపల్లెలో రెండు వారాల క్రితం సబ్ కలెక్టర్ కార్యాలయ దహన ఘటన కేసు డిఎస్‌పికి సవాల్‌గా మారనుంది. డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొండయ్య నాయుడు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి శాంతి భద్రతల పర్యవేక్షణలో పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సమస్యలపై వచ్చే ప్రజలకు సత్వరమే పరిష్కారం చూపే విధంగా పని చేయాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎస్‌పి

పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారం : ఎంఇఒ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని మండల విద్యాశాఖ అధికారి-2 సుబ్బరాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వైబిఎన్ పల్లె ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన పి.శివాజీ, మధు ఆర్థిక సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి సుబ్బారాయుడు పాల్గొని వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా నగరాల పట్టణీకరణతో రోజురోజుకు పచ్చదనం తగ్గిపోతోందని ఆవేదన చెందారు. మొక్కలు విరివిగా నాటడం వలన ప్రాణవాయువు స్థాయి పెరిగడమే కాక సకాలంలో వర్షాలు కురుస్తాయని వివరించారు. ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వృక్ష సంపదను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు వితరణ చేసిన శివాజీని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోతు గుంట నాగేశ్వరరావు, నవీన్, ఉపాధ్యాయిని పూర్ణిమ, అంగన్వాడీ కార్యకర్త కవిత, కల్పన, ఎంఎల్‌హెచ్‌పి సంధ్య, ఆశా కార్యకర్త ఆదిలక్ష్మి, పాఠశాల ఆయా రుక్మిణమ్మ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి -రాయచోటి టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం పండించే అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆగస్టు 2వ వారంలోపు ప్రభుత్వం తమ వాదనలతోకూడిన నివేదికను ఇవ్వాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కోరిందన్నారు. కర్నాటక రాష్ట్రం లేవనెత్తిన పరీవాహక ప్రాంతాల నిష్పత్తిలో నీటిని కేటాయించాలని కోరిన కోర్కెను ట్రిబ్యునల్ నిర్ద్వందంగా తిరస్కరించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 గత ట్రిబ్యునల్స్ తుది ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఏవిధమైన అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న, నిర్మించాలని తలపెట్టిన ప్రాజెక్టులు, ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వలన దిగువ రాష్ట్రమైన ఎపికిజరిగే అనర్థాలను ట్రిబ్యునల్ వారికి నివేదించవలసి ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, ఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ్‌నాయక్ పాల్గొన్నారు

'పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న జిడిఎ (జనరల్ డ్యూటీ అటెండర్స్) జీతాలు ఇవ్వాలంటూ శుక్రవారం ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేస్తున్న ఉద్యోగులకు 13 నెలలుగా జీతాలు అందడం లేదని శుక్రవారం ఆస్పత్రి ఎదుట బాదితులు నిరసన వ్యక్తం చేశారు. జీతాల కోసం పలుమార్లు మదనపల్లె, అన్నమయ్య జిల్లా అధికారులకు తమ గోడును చెప్పుకున్నా ఇంత వరకు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 18 మంది జిడిఎలు మదనపల్లె మెడికల్ కళాశాలలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. 13 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు స్కూల్ ఫీజు కట్టలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కోసారి కుటుంబమంతా పస్తులతో గడపాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. జిల్లా అధికారులకు ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోలేదని, నెలలుగా జీతాలు లేక దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మానవతా దృక్పథంతో ఆలోచించి, మాపై దయచూపి జీతాలు మంజూరు చేయాలని కోరారు. ఈ వియయమై అస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు మాట్లాడుతూ సర్వజన బోధనాస్పత్రి ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ నుండి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు మారినప్పటి నుండి జీతాలు పడటం లేదని చెప్పారు. లోపం ఎక్కడుందో గుర్తించి సమస్యను వెంటనే పరిష్కరించి జిడిఎలకు జీతాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిరసన కార్యక్రమంలో జిడిఎలు పాల్గొన్నారు.

జీతాల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న జిడిఎలు

మూతపడిన మరుగుదొడ్లు

మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి

అవస్థలు పడుతున్న ప్రయాణికులు, మహిళా కండక్టర్లు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడు ఆర్‌టిసి బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఉన్నా నీటి మోటార్‌కు మరమ్మతులు చేయకపోవడంతో మరుగున పడిపోయాయి. బస్టాండ్‌లో మరుగుదొడ్లలో నీటి వసతి లేకపోవడంతో తాళాలు వేశారు. మరుగుదొడ్లు నెలలు తరబడి వినియోగంలో లేకపోవడంతో ప్రయాణీకులకు, మహిళా కండక్టర్‌లు అవ స్థలు పడుతన్నారు. బస్టాండ్ వెనుక భాగంలోనే కూరగాయాల సంతకు చాలా మంది మహిళలు వస్తుంటారని వారు కూడా గతంలో ఇక్కడి మరుగుదొడ్లను వినియోగించుకునే వారని తెలిపారు. మహిళలు, మహిళా కండక్టర్‌ల పరి స్థితి అధ్వానంగా ఉందని వారు వాపో తున్నారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు ఉన్నా అక్కడ మోటార్ పనిచేయ కపో వడంతో తాళాలు వేశారని, అత్యవసర సమయాల్లో మహిళలు పడే కష్టం వర్ణాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. మగవారైతే ఎలాగోలా తమ కాలకృత్యాలను తీర్చుకోగలుగుతారని మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్ప టికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి నీటి మోటార్‌కు మరమ్మతులు చేయించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

రేపు గాలివీడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాసులు తెలిపారు. 11వ సర్వసభ సమావేశాన్ని ఎంపిపి జల్లా పద్మావతమ్మ అధ్యక్షతన జరిగే మండల సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ మెంబర్ మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావాలని తెలిపారు.

భూ బాధితుల సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ములకలచెరువు

ఈ నెల 4న ఆదివారం మదనపల్లిలో జరుగుతున్న రెవెన్యూ భూబాధితుల సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణప్ప, నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డిలు కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండు కూడలిలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు తదితర నియోజకవర్గాల భూ రికార్డులను, ఉద్దేశపూర్వకంగానే కాల్చివేసిన సంఘటన జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో అనేక దౌర్జన్యాలతో,అధికార బలంతో అన్యాయంగా రైతుల భూములు స్వాధీనం చేసుకున్నారని, అనేక రకాలుగా భూములు పోగొట్టుకున్న భూ బాధితులు కన్నీటి గాదలు ఎన్నెన్నో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శిఅంజనప్ప, నాయకులు నరసింహులు,వుత్తన్న, చౌడప్ప,యల్లప్ప పాల్గొన్నారు.

జనసేన నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-టి.సుండుపల్లి

లోకేష్‌ను పరామర్శిస్తున్న రామశ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన భాగంపల్లి గ్రామపంచాయతీ కుప్పగుట్టపల్లికి చెందిన ఎద్దుల లోకేష్‌ను శుక్రవారం జనసేన పార్టీ నాయకులు రామశ్రీనివాస్ పరామర్శించారు. జీవలన లోకేష్ వ్యక్తి గత పనిమీద రాజం పేటకు వెళ్లి తిరిగి సానిపాయి నుంచి టి.సుండుపల్లి రోడ్డుపై మార్గ మధ్యలో ద్విచక్ర వాహనంపై ప్రమాదానికి గురై రెండు చేతులు విరిగాయి. కడపలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని శుక్రవారం ఊళ్లో ఉన్నారు. లోకేష్‌ను పరామర్శించినవారిలో జనసేన నాయకులు మదన్‌కుమార్, మహేష్, నరేష్ ఉన్నారు.

సంస్కృతం శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

మండలంలోని గ్యారంపల్లెలో గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సంస్కృతం పరిచయం మూడు రోజుల అవగాహన సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా విచ్చేసిన డిగ్రీ కళాశాల లెక్చరర్ గంటాల గోవర్ధన్ ఇంటర్ విద్యార్థులు సంస్కృతం సులభంగా నేర్చుకోవడానికి వెలుపతులు, ఫ్లాష్ కార్డులు, చిత్రాల రూపంలో చూపించి డిజిటల్ లాబ్‌ను ఉపయోగించి సంస్కృత శ్లోకాలు పఠింపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో అన్ని దేశాలలో పురాణాలు, ఆధిపాసాలు సులభంగా అధ్యయనం చేయడానికి సంస్కృతం అవసరమని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చెన్నకేశవులు మాట్లాడుతూ సంస్కృతం చక్కటి అమృతభాష అని అదియే అన్ని భాషలకు మూలమని తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ ఆంజనేయులు, సంస్కృత లెక్చరర్ రామకృష్ణ, హరినాథ్, నాగేంద్ర, కొండయ్య, షకీలా మహమ్మద్,సయ్యద్ బాషా, నాగరాజా నాయక్, అన్నపూర్ణ, సౌజన్య, భారతి, తనూజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

ప్రజాశక్తి-సుండుపల్లి : జనసేన పార్టీ మహిళా నాయకురాలు సంధ్యా రెడ్డిరాణి ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల సమీపంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు వీర నాయక్, నాగరాజా, మాతయ్య పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** సుప్రీం కోర్టు రాష్ట్రాలే ఎస్‌సి వర్గీకరణ చేసుకునే హక్కు ఉందని తీర్పు ఇవ్వడంతో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు శుక్రవారం నిమ్మనపల్లి మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రెడ్డి నారాయణ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెదమాదిగ పల్లి నుంచి స్థానిక బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రెడ్డినారాయణ, ఎం.రెడ్డి ప్రసాద్, కొమ్ము వెంకటేష్, రాజశేఖర్, శేషు, హరిబాబు, కే.శ్రీనివాసులు, రాజన్న, శ్రీరాములు, వినోద్, సూరి, రామాంజులు రెడ్డప్ప పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిలో గల అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి సూరేపల్లి మురళీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ పెంచలయ్య, రాష్ట్ర నాయకులు యంబులూరు మణి, జిల్లా నాయకులు బాబు,మండల నాయకులు రామ్మోహన్, మల్లి, పెద్ద బాబు పాల్గొన్నారు.

సుండుపల్లి : ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న రెడ్డిరాణి

భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

- సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. శుక్రవారం మండల పర్యటనలో భాగంగా తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. బూర్లపల్లికి చెందిన రైతు ఎం.యర్రంరెడ్డి కుమారుడు ఎం.వెంకట్రమణారెడ్డి తన భూమి సమస్యను పరిష్కరించడంలో రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని సబ్ కలెక్టరుకు వినతి పత్రం అందించారు.సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతన్నల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, వారిని కార్యాలయాలు చుట్టూ తిప్పుకోరాదని సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించరాదని, మండలంలో రెవెన్యూ సమస్యలు లేకుండా చూడాలని వెల్లడించారు.

గోదాములో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె సబ్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ పేర్కొన్నారు.పట్టణంలోని రేషన్‌బియ్యం గోదాములను ఆయన ఆక స్మికంగా తనిఖీ చేశారు. గోదాములో నిల్వ ఉన్న రేషన్ బియ్యం బస్తాలను వాటికి సంబంధించిన రికార్డులను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డుదారులకు సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలలో డిప్యూటీ తహశీల్దార్ అన్సారీ, గోడౌన్ డిటి ఇన్‌ఛార్జి రవి, ఆర్ఐ బాలాజీ, ఎఎస్ఐ బొజ్జ నాయక్, విఆర్‌ఒలు హైదర్, అశోక్ పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి : ఎంపిడిఒ

వీరబల్లి: రోడ్లకు ఇరు వైపులు ఉన్న చెత్తను తొలగిస్తున్న కూలీలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని విజువల్ క్లీన్ అండ్ గ్రీన్‌గా మట్లీ గ్రామ పంచాయతీని ఎన్నుకోవడం జరిగింది. గ్రామ సర్పంచ్ నాగార్జునచారి ఆధ్వర్యంలో గ్రామాల్లో రోడ్లు ఇరువైపులా చెత్త, డ్రెయినేజీ నీటి నిల్వ, ఉండే ప్రదేశాలను గుర్తించి నీరు నిల్వ లేకుండా డోజర్ సహాయంతో రోడ్లకు ఇరు వైపుల ఉన్న మట్టి దిబ్బలను తొలగించినట్లు ఎంపిడిఒ రామచంద్రారెడ్డి తెలిపారు. వానపాముల సహాయంతో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల వద్ద పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేయించినట్లు తెలిపారు. మట్లి గ్రామంలో వర్మీ కంపోస్ట్ షెడ్ నిర్మించింది ఈ షెడ్డు దగ్గర పూల మొక్కలు, కూరగాయలు, పండించుటకు మొక్కలు నాటించినట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి వ్యర్థాలను వేరు చేసి పశువుల పేడ, వానపాములు ద్వారా సేంద్రీయ ఎరువు తయారు చేస్తున్నాని పేర్కొన్నారు. అలా తయారైన వర్మీ కంపోస్ట్‌ను బస్తాల్లోకి నింపి రైతులకు తక్కువ ధరకు విక్రయించ వచ్చు అన్నారు. మట్లి గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. మండలంలోని గ్రామ పంచాయతీలు వ్యర్థాల నుంచి సంపద సృష్టిస్తూ పంచాయతీకి ఆదాయ మార్గాలు పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, పంచాయతీ సెక్రటరీ వరప్రసాద్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విజువల్ క్లీన్ గ్రామ పంచాయతీగా వెలిగల్లు..

ప్రజాశక్తి-గాలివీడు విజువల్ క్లీన్ గ్రామ పంచాయతీగా వెలిగల్లును ఎంపిక చేశారు. గత వారం రోజులుగా ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్ , పంచాయతీ కార్యదర్శి సరోజ, సచివాలయం ఉద్యోగులు గ్రామంలో మురుగు కాలువలు ,రోడ్డుపై చెత్తాచెదారం లేకుండా వీధుల్లో రోడ్లన్నీ శుభ్రం చేయించారు. విజువల్ క్లీన్ గ్రామపంచాయతీగా వెలిగల్లును ఎంపిక చేయడంపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ తనిఖీ చేసి క్లీన్ చీట్ ఇవ్వనున్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

మదనపల్లె అర్బన్: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యకరమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల గోడ పత్రికలను ప్రారంభించారు. స్థానిక ప్రాజెక్ట్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, విశిష్టత పై ఎమ్మెల్యే వివరించారు. ఇందులో భాగంగా మెడికల్ ఆఫీసర్ సిడిపిఒ సుజాత మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. పిల్లలకి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, ఏడో నెలలో తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో తల్లిపాల వారోత్సవాలపై అవగా హన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యులు సురేష్ రెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **పుల్లంపేట :** తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా లాంటిందని బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్వాడీ సూ పర్వైజర్ జయలక్ష్మి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా అనంతంపల్లి అంగన్వాడీ కేం ద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లి పాలు బిడ్డకు వరం లాంటిదని ప్రతి తల్లి ఈ విషయం ఈనెల 7వ తేదీ వరకు అంగన్వాడీ కేంద్రంలో ముర్రుపాలు వలన లాభాలు, తల్లి పాలు వలన తల్లి కీ, బిడ్డ కు కలిగే ప్రయోజనాలు, తల్లి పాలు ఇచ్చే విధానం, తల్లి పాలతో పాటు అదనపు ఆహారం వంటి అంశాలు పట్ల గర్భిణులు, బాలిం తలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వనజాకుమారి, రెడ్డమ్మ, దేవి, సుబ్బలక్ష్మి, రెడ్డమ్మ, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం రాములమ్మ, గురవయ్య, రమణ, అమరావతి, నిర్మల, సుభాషిని, ప్రవల్లిక, పిల్లల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు. **కలకడ:** ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న దిగుపాలెంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించినట్లు వైద్యాధికారి ఎం.వి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. తల్లిపాలు బిడ్డకు అమృతమని వ్యాఖ్యానించారు. ప్రతి తల్లి పుట్టిన వెంటనే బిడ్డ కు మురిపాలు పట్టించాలని సూచించారు. బిడ్డకు ఇచ్చే మురి పాలలో పోష కాహారం వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని అంతేకాకుండా బిడ్డకు బలవర్ధకమైన ఆహారంగా ఉపయోగ పడతాయని తెలిపారు కార్యక్ర మంలో విస్తరణ అధికారి జి.జయరామయ్య, ప్రధానోపాధ్యాయులు సత్యవాణి, ఉపాధ్యాయులు అన్వర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పి అశ్వని, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మి , డేటా ఎంట్రీ రోజా, అంగన్వాడీ కార్యకర్త స్వర్ణకుమారి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

కలకడ: తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజా సమస్యలపై అలసత్వం వద్దు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని కమ్మవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మదనపల్లె నియోజకవర్గ శాసనసభ్యులు షాజహాన్ బాషా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని అధికారులు కాలయాపన చేయకుండా ఎప్ప టికప్పుడు ప్రజల సమస్యలు పరిస్కారానికి కృషి చేయాలని సూచించారు. రేషన్ కార్డ్, పెన్షన్, గృహ నిర్మాణాలు, జాబ్ కార్డ్, రేషన్ సరుకులు, త్రాగునీటి సమస్యలు గ్రామ, మండల అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే పరిస్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ గౌడ్, సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఎంపిటిసిలు నరసింహులు, చలపతి నాయుడు, మాజీ సర్పంచ్ వెంకటప్ప, శ్రీనివాసులు, ఆనంద్‌నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, రెడ్డెప్ప నాయుడు, యువనాయకులు శేఖర్‌నాయుడు, కురప్పల్లి నారాయణ స్వామి, యరనేలపల్లి కృష్ణంరాజు, నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న నాయకులు

బిసిజి టీకాపై అపోహలు వద్దు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసిజి టీకాపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

బిసిజి టీకాపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దంటూ హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్‌లు తెలిపారు. క్షయ వ్యాధి లేని సమాజం కొరకే పెద్దలకు బిసిజి టీకాలు ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు వివరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం మదనపల్లె అర్బన్ దొంతి వీధిలోని మక్కా మసీద్‌లో వయోజనులకు టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై ప్రతీ సోమ, గురువారాల్లో పెద్దలకు టిబిజబ్బు రాకుండా టీకాలు ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారని తెలిపారు. 60 ఏళ్ళు పైబడిన వారు, షుగర్ వ్యాధి గ్రస్థులు, బీడీ, సిగరెట్ త్రాగేవారు, టిబి జబ్బు వచ్చి తగ్గిపోయి బాగైన వారు, టి.బి.రోగితో కలిసి జీవించేవారు, ఎత్తుకు తగ్గ బరువు తక్కువ ఉన్నవారు బిసిజి టీకా తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. నమాజ్ తర్వాత పలువురికి టీకాలు వేసి వారితో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో మక్కా మసీద్ ముతవల్లి, సెక్రెటరీ షఫీమహి, లావణ్య, వనజ, రాధ, ఆశా కార్యకర్త గౌసియా తాజ్ పాల్గొన్నారు.

శిశువులకు సకాలంలో టీకాలు వేయాలి : డిఐఒ

ప్రజాశక్తి-పీలేరు

చిన్నారుల టీకాలు సరైన ఉష్ణోగ్రతలో సురక్షితంగా ఉంచి వాటిని ఇప్పించడమే మనం ఆ శిశువులకిచ్చే మొదటి జన్మదిన కానుకని జిల్లా వ్యాధి నిరోధక టీకాల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. శుక్రవారం డిఐఒ తలు పుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషశ్రీ వ్యాక్సిన్ ను భద్రపరుచడానికి ముఖ్యమైన మార్గదర్శకాలు, వ్యాక్సిన్ నిల్వ ఉంచాల్సిన సరైన ఉష్ణోగ్రతలు, సెషన్‌కు రోజువారీ వినియోగించే వ్యాక్సిన్, మిగిలిన నిల్వలు పరిశీలించారు. స్థానిక సిబ్బందికి ప్రస్తుతం అమలౌతున్న జాతీయ ఆరోగ్య సేవలకు సంబంధించిన రికార్డులు, రిపోర్ట్లులు పరిశీలించి వాటి తయారీకి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఫార్మసిస్ట్ ప్రభావతి, స్టాఫ్ నర్స్ లక్ష్మి పాల్గొన్నారు.

రేపు చౌడేశ్వరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లి

పట్టణంలోని నీరుగట్టువారి పల్లెలో వెలసిన తొగట వీరక్షత్రియుల ఆరాధ్యదైవం శ్రీచౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను 4న ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి బండి పవన్ కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్యలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది అమ్మవారి జయంతి ఉత్సవాలకు ప్రతిష్టాత్మకమైన ఏర్పాట్లు చేశామన్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నప్రసాద వితరణ, మధ్యా హ్నం 3 గంటల నుంచి అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొగటవీర క్షత్రియ కులబాంధవులు, పట్టణ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి జయంతి వేడుకలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సమీపంలో బీహార్ రాష్ట్రానికి చెందిన రాజ్‌బల్లి క్వారీలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రెండు రోజుల క్రితం చనిపోవడంతో పోస్టుమార్టం నిర్వహించి, అతని దహన సంస్కారాల కోసం బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో మదనపల్లె టూ టౌన్ పోలీస్ స్టేషన్ వారు హెల్పింగ్ మైండ్స్ బృందాన్ని సంప్రదించడంతోవారు అతని దహన సంస్కారాలను హిందు సాంప్రదాయ బద్ధంగా, పవిత్రంగా నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లా డుతూ ఎవరు లేని అనాథ మృతదేహాలను వారి వారి మత సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల తోనే నిజమైన ఆత్మసంతృప్తి లభిస్తుందని వెల్లడిం చారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, కమ్మల ఆనంద్, ఇంద్ర పాల్గొన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న జయరాణి

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-రామాపురం

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆచరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని లక్కిరెడ్డిపల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎమ్.జయారాణి పేర్కొన్నారు. శుక్రవారం రామాపురం మండ లంలోని గొల్లపల్లి గ్రామంలో నిర్వహిం చిన పొలంబడి కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పొలంబడి ఆవశ్యకతను తెలియజే శారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడకం ద్వారా అధిక పెట్టుబడి తగ్గించి ఎక్కువ దిగుబడి సాధించ వచ్చని అన్నారు. వేరుశనగ పంటలో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చని అన్నారు. వేరుశనగ పంట చుట్టూ నాలుగు వరుసలలో జొన్న పంటను రక్షక పంటగా వేసుకోవడం ద్వారా తామర పురుగులను నివారించవచ్చని తెలిపారు. ఆముదం పంటను ఎర పంటగా వేసుకోవడం ద్వారా పొగాకు లద్దె పురుగును నివారించుకోవచ్చు అని పేర్కొన్నారు. వేరుశనగ పొలంలో రసం పీల్చు పురుగుల నివారణకు వేప నూనె పిచికారి చేసుకోవాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగమణి, ,రైతు సేవ కేంద్రంసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో బాలుడు మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

జాన్‌వెస్లీ(ఫైల్ ఫొటో)

మండల పరిధిలోని దలవాయిపల్లె దళితవాడకు చెందిన రాజ బోయిన జాన్‌వెస్లీ అనే మూడేళ్ల బాలుడు విద్యుదాఘాతంతో మృతి చెందారు. బాలుడి తల్లిదండ్రులు రాజబోయిన సెల్వంకుమార్, బిందుప్రియ తెలిపిన వివ రాల మేరకు.. తమకు ఏడేళ్ల క్రితం వివాహమైందని ఐదేళ్ల వరకు పిల్లలు లేరని తెలిపారు. ఐదేళ్ల తర్వాత తమకు జాన్‌వెస్లీ జన్మించాడని తెలిపారు. ఇంటిలో నడుచుకుంటూ బాత్‌రూమ్ వైపుకు వెళ్లారని గోడకు విద్యుత్ ఎర్త్ రావడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారని బోరున విలపించారు. శుక్రవారం టిడిపి నాయకుడు శివయ్య బాలుడి సమాధి వద్ద నివాళి అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సహకారం అందిస్తానని చెప్పారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హిందీ ప్రమాణ పత్రాలు అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం హిందీ మాధ్యమ పరీక్ష ఉత్తీర్ణైన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సివి.రమణమూర్తి ఆధ్వర్యంలో ఉత్తీర్ణత ప్రమాణ పత్రాలను అంది ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషను బోధించడమే కాకుండా ప్రచారసభ పరీక్షలను కూడా రాయిస్తున్నట్లు తెలిపారు. తద్వారా భవి ష్యత్తులో విద్యార్థులు హిందీ భాషకు సంబంధించి ఉపాధి రంగంలో అవకాశాలు కలిగి ఉంటారని తెలిపారు. హిందీ లో ప్రావీణ్యం కలిగినట్లయితే ప్రస్తుత సమాజంలో దేశంలో ఎక్కడికైనా వెళ్లి రావచ్చునని అన్నారు. కార్యక్రమంలో కృష్ణం పల్లి పాఠశాల ఉపాధ్యాయుడు విశ్వనాథ్, టి.కమ్మపల్లి హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మాలమహానాడు నిరసన

ప్రజాశక్తి-పీలేరు

ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ పీలేరులో మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. శుక్రవారం పీలేరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో గంటకుపైగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ మాల, మాట్లాడుతూ గతంలో ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని కొట్టి వేసిన ఇదే అత్యున్నత న్యాయస్థానంలో ఇప్పుడు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏ విధంగా వర్గీకరణ సమంజసం అని తీర్పు ఇచ్చిందో తెలియడం లేదని అన్నారు. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో తీర్పు వచ్చిందని దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు గమనించాలని తెలిపారు. సంవత్సరాల తరబడి మెజారిటీ జనాభా కలిగిన ఎస్‌సిలు 15 శాతం రిజర్వేషన్ కే పరిమితమై విద్య, ఉద్యోగాలలో ఇబ్బందులకు గురవుతుంటే రిజర్వేషన్ పెంచే ఆలోచన చేయని కేంద్ర ప్రభుత్వం కేవలం కొన్ని అగ్రవర్ణ మనువాద రాజకీయ పార్టీల ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇలాంటి తీర్పుకు మద్దతు తెలిపిందని ఆరోపించారు. ఈ విషయంపై తిరిగి సుప్రీంకోర్టులో కేసు వేస్తామని ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ఎంపిలు పార్లమెంట్లో వర్గీకరణకు మద్దతు తెలిపితే ఎంపిల ఇళ్ల ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా మాలలు ఏకమై భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేసే ఇలాంటి తీర్పులను వ్యతిరేకించాలని, ఈ తీర్పుపై మేధావులు, సుప్రీం కోర్టు పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, ద్వారక, జాతీయ అంబేద్కర్ సేవా సంఘం జిల్లా అధికార ప్రతినిధి మచ్చ రెడ్డయ్య, జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షులు దప్పేపల్లి సురేంద్ర, పీలేరు మాలమహానాడు మండల కార్యదర్శి టముకు ప్రభుతేజ పాల్గొన్నారు.

మూగజీవాలకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాల్లోని మూగజీవాలకు ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని పశుసంవర్ధక శాఖ ఎడి సుమిత్రాదేవి సూచించారు. శుక్రవారం తంబళ్లపల్లె పశు వైద్య కేంద్రంలో రెండు మండలాల పశువైద్యులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. రెండు మండలాలలో గొర్రెలకు బొబ్బల వ్యాధి, నీలి నాలుక వ్యాధి నివారణకు సుమారు 68 వేల మూగజీవాలకు టీకాలు వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.పశువులలో ముద్దచర్మ వ్యాధి సోకకుండా 18 వేల పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ సమీక్షలో మండల పశువుల డాక్టర్ సుజనాశ్రీ, పెద్దమండెం వైద్యులు ఉస్మాన్, విక్రమ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉషారాణి (ఫైల్ ఫొటో)

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన గురువారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా, ఎన్‌పి కుంట మండలం, వెలిచలమలకు చెందిన రామాంజులరెడ్డి ఉషారాణి (38) దంపతులు 15 ఏళ్ల క్రితం మదనపల్లె కు వలస వచ్చారు. వీరికి కుమార్తె వివర్ణ(18), కుమారుడు రూపేష్(13)లు ఉన్నారు. రెడ్డీస్ కాలనీలో నివాసముంటూ స్థానిక కదిరి రోడ్డులో బట్టల దుకాణం నిర్వహిస్తున్నారు. కొంత కాలంగా వ్యాపారం సక్రమంగా జరగకపోవడంతో కుటుంబంలో సమస్యలు మొదలయ్యాయి. భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో రాత్రి భర్త రామాంజుల రెడ్డి, కుమారుడు రూపేష్‌లు టివి చూస్తుండగా తనకు చాలా తలనొప్పిగా ఉంది పడుకుంటానని చెప్పి బెడ్ రూమ్ లోకి వెళ్లి తలుపేసుకుంది. ఎంతసేపటికి రాకపోవడంతో భోంచేసుందుకు పిలిచారు. ఎంతకూ పలకకపోవడం డోర్ తట్టగా గడియ పెట్టుకుంది. దీంతో బలవంతగా డోర్ ను బద్దలకొట్టి తెరిచి చూడగా ఫ్యాన్ కు ఉరేసుకొని మృతి చెందింది. భర్త పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని స్థానిక సర్వజన బోధన ఆసుపత్రికి తరలించారు. ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.